# మానవత్వమా - ఎక్కడున్నావ్ ?

సుబ్బారావ్ స్కూటర్ మీద నుండి క్రిందపడ్డాడు. కాలు విరిగింది.

అసలు మా యిద్దరికీ కాళ్ళు విరిగి ప్రక్క ప్రక్క బెడ్‌లలో చేరవలసింది. మా ఆవిడ మంగళసూత్రానికి కట్టిన త్రాడు కొంచెం గట్టిదవటంవల్ల - నాకేమీ దెబ్బ తగలలేదు. సుబ్బారావ్‌కి మాత్రం తొంటి దగ్గర జాయింట్ విరిగింది.

సుబ్బారావ్‌కి మరి వెనకాల ఎవరూ లేరు. అందుకే ప్రాణస్నేహితుడిని కనుక నేను

కలుగ చేసుకోవలసి వచ్చింది.

సుబ్బారావ్‌ని నెమ్మదిగా యింటికి చేర్చి, ఫామిలీ డాక్టర్ను పిలచి చూపించాను. ఆయన ఎముక విరిగి వుండవచ్చు ఆర్థో స్పెషలిస్ట్‌కి చూపించమన్నాడు.

అతను పడే బాధ చూస్తే హాస్పిటల్ కెలా చేర్చాలో అర్థం కాలేదు.

గవర్నమెంటు హాస్పిటల్‌కి ఫోన్ చేశాను, అంబులెన్స్ పంపించమని. మా వూరి గవర్నమెంటు ఆసుపత్రిలో ఇంకా అంబులెన్స్ కొనలేదుట- త్వరలో ఏదో ఫర్మ్‌కి ఆర్డర్ చేయబోతున్నారుట (ఆ ఫర్మ్ పేరూ, వూరూ కూడా అతను చెప్పినట్టు జ్ఞాపకం). ఇక లాభం లేదనుకుని ఫైర్ సర్వీస్ వారికి ఫోన్ చేశాను. వాళ్ళ అంబులెన్స్ రిపేరులో వుందిట - నెల రోజుల నుంచీ, (షుమారుగా రిపేరు చార్జీలు ఎంత అవుతయ్యో కూడా చెప్పినట్టు జ్ఞాపకం). ఏదో ప్రైవేట్ హాస్పిటల్‌కి ఫోన్ చేస్తే అంబులెన్స్ యివాళ పని మీద వుంది కనుక - యింకా అవసరం అయితే (అంటే?) రేపు పంపిస్తాం అన్నారు.

ఈ లోపల సుబ్బారావ్ బాధ యింకా ఎక్కువ అవటం వల్ల అలాగే ఒక గుర్రపు బండిలో పడుకోబెట్టి - గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాను.

నేను గవర్నమెంటు హాస్పిటల్లో ఆడుగుపెట్టడం అదే మొదటిసారి.

బండిని పోర్టికోలో ఆపించి - గవర్నమెంటు హాస్పిటల్ అనే ఆ క్రొత్త (వింత) ప్రపంచంలో అడుగుపెట్టాను.

ముందు ఓ.పి (అవుట్ పేషంటు) టిక్కెట్టు తీసుకోవాలిట. అక్కడ కొండవీడు చాంతాడంత క్యూ వుంది. ఆ క్యూలో చాల కొద్దిమంది మాత్రమే ఆరోగ్యంగా కనిపించారు. మిగతా వారు రకరకాల రోగాలతో బాధ పడుతున్నారులా వుంది - రకరకాలుగా క్యూలో - నుంచుని, కూర్చుని, వంగుని - మహా ఇబ్బందిపడిపోతున్నారు. మన్నుతిన్న పాములా క్యూ చాల నెమ్మదిగా కదుల్తున్నది. ఆ క్యూలోనే చివరగా నుంచున్న ముసలాయన శ్వాస ఎగబీలుస్తున్నాడు. ఆయన ముందు కనీసం అరవై మంది అయినా వుండి వుంటారు. ఈ అరవై మందిని దాటి ఆయన చీటీ తీసుకునే లోపలే ఆ శ్వాస ఆగిపోతుందేమో అనిపించింది.

నేనూ క్యూలో నుంచున్నాను.

కిటికీలోనించి బయట గుర్రబ్బండి కనపడుతున్నది. సుబ్బారావ్ బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. బండివాడు ఆలస్యం అవుతున్నదని సుబ్బారావ్‌ని అడుగుతున్నాడు.

కాకీ నిక్కరు, కాకీ చొక్కా అతను నా దగ్గరకు వచ్చాడు.

“పేరూ, వయసూ చెప్పండి - ఓ.పి టిక్కెట్టు అర నిముషంలో తెచ్చిస్తాను!” అన్నాడు.

అతన్ని తేరిపార చూశాను. నెత్తిన నెమలి పింఛమూ, చేతిలో మురళి, పెదవుల మీద చిరునవ్వు, మెడలో పూలదండా, శరీరం మీద నుంచీ కస్తూరీ జవ్వాది సువాసనా, అచ్చం శ్రీకృష్ణ పరమాత్ముడిలా అనిపించాడు. తన్మయుడినయాను. అర్థ నిమీలిత నేత్రాలతో - సుబ్బారావ్ పేరూ, వయసూ చెప్పాను.

మరుక్షణంలో మాయమయి, అర క్షణంలో మళ్ళీ ప్రత్యక్షమయాడు. మానసంరక్షణం సీనులో శ్రీకృష్ణుడు ద్రౌపదికి చీర అందించినట్లు, ఓ.పి చీటీ నా చేతికందించాడు.

"థేంక్స్!" కదలబోయాను.

శ్రీకృష్ణుడు యశోదకు నోరు తెరిచి విశ్వం చూపించిన ఫోజులో నోరు తెరిచాడు. ఆ నోటి వాలకం చూస్తే నవ్వినట్టు అనిపించింది.

నేనూ నవ్వాను - ఏమీ అర్థం కాక.

"రెండ్రూపాయలిస్తారు సార్!" అన్నాడు.

ఎంత కొత్తయినా, మరీ అమాయకుడినేం కాదు.

"ఏం చేశావనోయ్ రెండ్రూపాయలు - పావలా యిస్తాను అంతే!" అది మాత్రం ఎందుకివ్వాలి అన్న ఆలోచన ఆ సమయంలో ఎందుకనో రాలేదు.

"పావలా గవర్నమెంటు ఆసుపత్రి గేటు దగ్గర బిచ్చగాడు కూడా తీసుకోడు సార్ - యిక్కడ రేట్లంతే!" గడుసుగా అన్నాడు.

"రెండు రూపాయలు మరీ ఎక్కువ!" అన్నాను.

"మీరు క్యూలో నుంచుని వుంటే తెలిసేది సార్- ఓపీ టైము అయే లోపల మీకు టిక్కెట్టే దొరికేది కాదు. యిక లోపలికేం వెడతారు..." యింకా ఏదో సణుగుతున్నాడు.

వాడి చేతిలో ఓ అర్థరూపాయి పెట్టి - గబగబా లోపలకు వచ్చాను.

వెనక అతను సణగడం వినపడుతూనే వున్నది.

స్ట్రెచర్ తీసుకుని, సుబ్బారావ్‌ని దానిమీద లోపలకు తీసుకువచ్చాను. యింకా డాక్టర్‌గారు రాలేదు. కారిడార్‌లో నుంచున్నాను.

రామకృష్ణ కనపడ్డాడు.

"ఎందుకొచ్చావ్?" అన్నాడు.

వివరంగా చెప్పాను.

"ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ రాజారామ్‌కి కొంచెం ఆకలెక్కువ. ముందు కొంత యిస్తే కాని కేసు చూడడు. ముందే డబ్బులిస్తావు కనుక, అవసరమయితే వార్డులో ఎడ్మిట్ చేసుకుంటాడు. కేసు చాల జాగ్రత్తగా చూస్తాడు. లేకపోతే మీ కేసు అంతే!" అన్నాడు.

నేను ఏదో అడగబోయాను.

'అడుగో ఆయనే డాక్టర్ రాజారామ్. లోపలకు వెళ్ళేలోపలే కలిసి - వివరాలు చెప్పు' రామకృష్ణ వెళ్ళిపోయాడు.

రాజారామ్‌ని విష్ చేశాను. విషయం చెప్పాను.

"తప్పకుండా ఫ్రాక్చర్ అయి వుండాలి. చూద్దాం. కాని ఎలా? ఎడ్మిట్ చేసుకోవడానికి బెడ్స్ లేవే - " కారు దిగబోయాడు.

వెంటనే కారు సీటు మీద అయిదు పదులు వుంచాను.

"రండి!" చటుక్కున - నిర్లక్ష్యంగా - డబ్బులు జేబులో తోసేసి బయల్దేరాడు.

సరాసరి స్ట్రెచర్ దగ్గరికి వచ్చి సుబ్బారావ్‌ని పరీక్ష చేశాడు. ప్రక్కనే వున్న హౌస్ సర్జన్‌తో చెప్పాడు - వెంటనే వార్డులో ఎడ్మిట్ చేసి, ఎక్స్‌రే తీసి, సాయంత్రంలోపల రిపోర్టు తనకి చూపించమని.

అప్పుడే ఆ అర్థోపెడిక్ వార్డును కళ్ళారా చూసే సద్భాగ్యం కలిగింది. కొంతమందికి కాళ్లూ, కొంతమందికి చేతులూ పెద్ద పెద్ద బాండేజీలలో వేసి - పైన సపోర్ట్సుకి వ్రేలాడదీశారు. పెద్ద బాండేజీలో బంధించబడిన తన విరిగిన 'స్వంత' కాలును - రోగి మరచిపోకుండా ప్రతి ఏంగిల్‌లోనూ కనపడేటట్లుగా గాలిలో అతని కళ్ళ ఎదురుగా వ్రేలాడదీయటం - పేషెంటు బాధను ఎంత పెంచుతుందో కాని - డబ్బుకి కక్కుర్తిపడే డాక్టర్ ఆదాయాన్ని మాత్రం బాగా పెంచగలదు.

పొట్టిగా, నల్లగా చింతమొద్దులా వున్న ఒకతను ఎదురుగా వచ్చాడు. అతని వుద్యోగం, పేరూ అన్నీ బ్రదరే. అతనితో ఓ నలుగురు సిస్టర్స్, ప్లస్ తోటీలు, యిదీ అక్కడి స్టాఫ్. మరచిపోయాను. వాళ్ళతో ఒక సిస్టర్ పేరు 'స్టాఫ్'ట-

స్ట్రెచర్ అతను బ్రదర్‌తో ఏదో చెప్పాడు. నేనూ చూపించవలసిన కాగితాలు చూపించాను. 'ఓహో రాజారామ్ గారి పేషెంటా!' బ్రదర్ వెకిలిగా నవ్వటం తన సొత్తేనని నిరూపించి - మా బెడ్ చూపించాడు.

సణుగుతున్న స్ట్రెచర్ అతన్ని పంపించి వచ్చాను.

తోటీ వచ్చి బెడ్‌పాన్, యూరిన్‌పాన్ మంచం క్రిందపెట్టి, నా వేపు ఒకసారి చూసి "నమస్కారంసార్" అన్నాడు. అని అక్కడ్నించి కదలలేదు. నేనూ అతన్ని చూసి ఏమి మాట్లాడలేదు.

"నేను తోటీని సార్- నా పేరు భైరవయ్య - అవసరం అయితే పిలవండి ఇక్కడే వుంటాను - " అన్నాడు కానీ కదలలేదు. నేనూ వింతగా చూశాను.

అర్థవంతంగా నవ్వాడు కనుక అర్థమయింది.

అవతల బెడ్ మీద ఒక పదేళ్ళ కుర్రవాడు వున్నాడు. ప్రక్కనే ఒక నడివయసావిడ వుంది. ఆ కుర్రవాడికి బెడ్‌పాన్ అవసరం అయింది కాబోలు - తోటీ ముందు విననట్టు నటించాడు. తర్వాత విసుగ్గా నిర్లక్ష్యంగా అన్నాడు. - "ఉండవమ్మా - తెచ్చిస్తాన్లే - మీ సొంత నౌకరు లాగా చీటికీ మాటికీ పిలవటం తెలుసుగాని, ప్రొద్దుట్నించీ కాఫీ కూడా తాగలేదు - ఒక రూపాయి..... " యింకా..... యింకా సణుగుతున్నాడు. కానీ కదలలేదు. ఆవిడకి బెడ్‌పాన్ యివ్వనూ లేదు.

మెల్లగా అన్నాను. "పోనీ ఈ పాన్ యివ్వు - మళ్లా కడిగి యిక్కడ పెడుదువు గాని --" అన్నాను.

భైరవయ్య నవ్వాడు - "అఖ్ఖర్లేదు, వుండనీయండి సార్ -- కాళ్లు విరిగి ప్రక్క మీద

చేరతారు. యింక అన్ని పనులూ మేమే చేయాలి - కాని, కానీ డబ్బు విదల్చరు - కాలు బాగవాలి - డబ్బు ఖర్చవ కూడదు --'

నేనూ నవ్వాను. తర్వాత అనుకున్నాను - ఎందుకు నవ్వానా అని. మీ కెందుకు డబ్బివ్వాలి - ప్రభుత్వం మరి మీకు జీతాలు యిస్తున్న దెందుకు? అని ఎందుకు అనలేదా అనుకున్నాను తర్వాత.

నా నవ్వుని మరి ఏ రకంగా అర్థం చేసుకున్నాడో కాని, భైరవయ్య యింకో నమస్కారం పెట్టి - పిలుస్తున్న యింకో డబ్బుగలాయన దగ్గరికి పరుగెత్తాడు.

హడావిడిగా వచ్చాడు బ్రదర్. - "నడవండిసార్! అందరూ బయటికి నడవాలి. పెద్ద డాక్టరుగారు వస్తున్నారు - నడవాలి - యిక్కడ వుంటే కోప్పడతారు-" అరుస్తూ గబగబా అందర్నీ బయటకు పంపిస్తున్నాడు.

"ఏమ్మా - నీ కెన్నిసార్లు చెప్పాలి - డాక్టర్ వచ్చే సమయానికి బెడ్ దగ్గర ఎవరూ వుండకూడదని - బయటకునడు" అంటున్నాడు బ్రదర్.

నడివయసావిడ బ్రదర్‌ని అదో రకంగా చూసింది. నెమ్మదిగా అన్నది "నా దగ్గర 'ఎంటెండెంట్ పాస్' వున్నది" అని--

"ఉంటే -- యిక్కడ వుండాలా నువ్వు. డాక్టరుగారు రౌండ్సుకి వచ్చినప్పుడు యిక్కడ ఎవరూ వుండకూడదు - బయటకు నడవాలి--"

ఆవిడ అతనివేపు ఒకసారి ఏహ్యంగా చూసి బయటకు నడచింది.

నేనూ బయటకు నడవబోయాను. బ్రదర్ నవ్వాడు. "ఫర్వాలేదు - మీరు వుండండిసార్ - డాక్టర్ రౌండ్సుకి వచ్చేటప్పుడు - రోజూ యింతే - చెబుతే వినరు. పైగా..."

డాక్టర్ రాజారామ్ బూట్లు టకటక లాడించుకుంటూ వార్డులోకి రావటం చూసి బ్రదర్ ఎదురెళ్లాడు. రాజారామ్ వెనక యిద్దరు అసిస్టెంటు సర్జన్లూ - నలుగురు హౌస్ సర్జన్లూ - చకచకా వస్తున్నారు.

నేను రాజారామ్‌ని చూసి కొంచెం ప్రక్కకి తప్పుకున్నాను. ఆయన చిరునవ్వు నవ్వాడు "రండి!" అంటూ సరాసరి సుబ్బారావ్ దగ్గరకు వచ్చాడు. ఒక అరగంట పరీక్ష చేశాడు.

"నెక్ ఆఫ్ ఫ్యుమర్ - తొంటి దగ్గర ప్రాక్చర్ అయివుండాలి. ఆపరేషన్ చేయవలసిరావచ్చు. వెంటనే ఎక్సరే తీయించండి" గబగబా ప్రక్కనే వున్న హౌస్ సర్జన్‌తో అని -- నా వేపు తిరిగి "డోంట్‌వర్రీ -- ఐవిల్ లుక్ ఆఫ్టర్ ఎవ్వరి థింగ్" అంటూనే యింకో బెడ్ దగ్గరికి వెళ్లాడు. ఆ గదిలో వున్న ఇరవై బెడ్స్‌లోనూ ఆయన చూసినవి నాలుగు మాత్రమే - మిగతావి కేసుషీట్లు మాత్రం చూసి ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిపోయిన తర్వాత భోజనాలు తెచ్చిన రోగుల తరపు మనుషులు బిల బిలమంటూ లోపలకు వచ్చారు.

ఎక్సరే తీసిన తర్వాత -- డాక్టర్ రాజారామ్ మళ్ళీ వచ్చి పరీక్ష చేశాడు.

"ఆపరేషన్ చేయాలి - అనెస్థిస్ట్ చూసిన తర్వాత ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేద్దాంలెండి-

-'' అన్నాడు నాతో.

''బ్లడ్, యి.సి.జి., యి.యస్.ఆర్, బి.పి అన్ని పరీక్షలూ చేయించండి. లెట్ మీ నో వెదర్ దిస్ పేషెంటు ఈజ్ ఫిట్ ఫర్ ఆపరేషన్, బి ఫోర్ దిస్ ఈవినింగ్ -- ప్లాస్టర్ వేసి, వెయిట్ కట్టండి'' అన్నాడు హౌస్ సర్జన్‌తో.

ఆయనతోపాటు వేగంగా ప్రక్కనే నడుస్తున్నాను. నెమ్మదిగా అన్నాడు.

''ఎనస్థీషియన్‌ను కలిసి -- ఆయనకో ముప్ఫయి రూపాయలు యివ్వండి -- పెద్ద ఆపరేషన్ కనుక ఆయన్ని కూడా కనిపెట్టి వుండటం అవసరం -- రాత్రి ఏడు గంటలకు నేను యింటి దగ్గరే వుంటాను - వచ్చి కలవండి!''

''నాకేం మాట్లాడాలో అర్థం కాలేదు - కాని ఏదో అసంకల్పిత ప్రతీకార చర్య వల్ల కాబోలు - సరేనన్నట్టు తలూపాను. అదే విషయం సుబ్బారావ్‌తో చెప్పాను.

''ఈ రోజే వెళ్ళి ఎనెస్థీషియన్‌ను కలసి ఆ డబ్బు ఇచ్చేసిరా -- డాక్టర్ రాజారామ్‌ని కూడా యింటి దగ్గర కలసి ఎంత అడిగితే అంతా యిచ్చేయి--'' అన్నాడు.

సుబ్బారావ్ వేపు సూటిగా చూశాను - దిగులుగా వున్నట్టున్నాడు. అయినా అన్నాను. ''మనం అసలు డబ్బెందుకు యివ్వాలిరా - ప్రభుత్వం జీతం యివ్వటం లేదా - పైగా ఆపరేషన్ చేసే ఆయనకే కాకుండా ఎనస్థీషియన్‌కి కూడానా - ఏం ఆయనకు డబ్బు యివ్వకపోతే -- ఎనస్థీషియా సరిగ్గా యివ్వడా - అసలు వాళ్ళకేమీ యివ్వొద్దు - అదీ చూద్దాం!''

సుబ్బారావ్ విసుకున్నాడు - ''ఏడ్చావులేవోయ్ -- వాళ్ళేదైనా ఆపరేషన్ అటూ యిటూ చేస్తే - అనవసరంగా నా ప్రాణం పోతుంది. ఎందుకుగాని ఈ గవర్నమెంటు హాస్పిటల్‌కి రావటమే పొరపాటు. వచ్చింతర్వాత... యివ్వక తప్పదు. నా అనుభవం మీద చెబుతున్నాను - వెళ్ళి ఇచ్చేయి'' గట్టిగా అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు.

అసిస్టెంట్ సర్జన్ అన్నాడు బ్రదర్‌తో - బాండేజ్ వేసి వెయిట్ కట్టాలి, ప్లాస్టర్ తీసుకు రమ్మని --

''ప్లాస్టర్ మన దగ్గర అయిపోయింది సార్ - రెండ్రోజుల దాకా స్టాకు రాదు. ఆయన్నే కొని తీసుకు రమ్మనండి -- వేద్దాం!'' అన్నాడు బ్రదర్.

ఒక కాగితం మీద ఆ ప్లాస్టర్ పేరు వ్రాసి అసిస్టెంటు సర్జన్ నా చేతికందించి,'' ఈ ప్లాస్టర్ కొని తీసుకురండి - రాత్రి నేను వచ్చి బాండేజి వేస్తాను. పది రూపాయలు అవుతుందేమో అది చాల అవసరం. స్టాకులో లేదు కనుక మీరు తెస్తేనే నయం'' అని వెళ్ళిపోయాడు.

సుబ్బారావ్ వేపు చూశాను.

''వెళ్ళి తీసుకురా'' అన్నాడు.

నేను కదలలేదు. ''యింత పెద్ద హాస్పిటల్లో ప్లాస్టర్ లేదా? - అంతా నాటకం -''

అన్నాను.

"నాటకమో బూటకమో నీ కనవసరం. ముందు వెళ్ళి తేరా బాబూ - ఒక్కొక్కప్పుడు చచ్చే వాళ్ళకి ప్రాణం పోసే ఆక్సిజన్ సిలెండర్లే స్టాకులో వుండనిది ఆఫ్టరాల్ ప్లాస్టర్ వుంటుందా - నా మాట విని వెళ్ళు"

ప్రాణస్నేహితుడిని కనుక వాడి బాధ కొంచెం అర్థమయింది. ప్లాస్టర్ తెద్దామని బయలుదేరాను. ప్రక్కన ఎవరో సకిలించిన శబ్దమయింది. ఉలిక్కిపడ్డాను. బ్రదర్ ఇకిలిస్తున్నాడు. "ఏం బ్రదర్?" అన్నాను.

"నేను యిలా అవసరానికి వాడ వచ్చని ప్లాస్టర్ డబ్బా ఒకటి కొని వుంచాను సార్. అనవసరంగా పది రూపాయలు ఖర్చుపెట్టి - బజారెళ్ళి ఎక్కడ తెస్తారు, ఆరు రూపాయలు యిలా పారేయండి యిస్తాను".

అంతా అర్థమయింది. బాగా కోపం కూడా వచ్చిన మాట నిజమే! అయినా నాలుగు రూపాయలు ఆదా అవుతాయనో ఏమో - ఆరు రూపాయలూ యిచ్చి ప్లాస్టర్ రోల్ తీసుకున్నాను.

తర్వాత ఆలోచించాను. అన్ని విషయాలు తెలిసి వుండీ యిలా ఎందుకు ప్రవర్తిస్తున్నానా అని - ఎంత ఆలోచించినా ఒకటే అనిపించింది. ఇది పెద్ద ఆపరేషన్, ప్రాణాలతో సంబంధించినదీ అనేసరికి మనకి ఒక విధమైన భయం, గాభరా సహజంగా వుంటాయి. అక్కడే మన వీక్‌నెస్ డబ్బు కాపీనం వున్న వాళ్ళకి అర్థమయిపోతుంది. ఆ వీక్‌నెస్‌ని ఆధారం చేసుకుని - డబ్బు కోసం ఎక్స్‌ప్లాయిట్ చేద్దామని చూస్తారు. పెద్ద పెద్ద చదువులు చదివిన డాక్టర్లే డబ్బు కాపీనంతో - మానవత్వాన్ని, ప్రాణాల విలువల్ని మరచి అలా చేస్తుంటే - చిన్న చిన్న వుద్యోగులు ఎంకరేజ్ అయి - రోగి దగ్గర రక్తం పిండి డబ్బు వసూలు చేస్తారు. పేషెంటు కాదూ కూడదూ అంటే - అన్ని సౌకర్యాలలోనూ లోటు పాట్లే వుంటాయి. ప్రతిపనీ చాల తీరిగ్గా జరగటమూ, కావలసిన మందులూ, అవీ అవసరానికి అందకపోవటమూ - ప్రతి చోటా, ప్రతి నిముషం రోగిని నిర్లక్ష్యంగా చూడటం జరుగుతాయి. దానివల్ల ప్రతి పేషెంటూ చనిపోకపోవచ్చు. కాని అనవసరపు కాంప్లికేషన్స్, రోగం నయమవటానికి ఎక్కువకాలం పట్టటమో జరుగుతాయి. అంతేకాక పేషెంటులోని సహజమైన ప్రాణభయం, బ్రతకాలనే ఆశ - డబ్బులు చేతిలో లేకపోయినా, అప్పుచేసి అయినా ఈ 'మామూళ్ళు' (పెద్ద డాక్టర్లు హాస్పిటల్లో బెడ్స్ యివ్వటానికీ, మిగతా వాటికీ - రోగుల్ని కొల్ల గొట్టేవాటిని మామూళ్లు అనకూడదేమో) యివ్వటానికి సిద్ధపడతారు. మరి అది పేషెంటు తప్పు అనాలో, రోగులలోని బలహీనతను అవసరానికి వాడుకునే ప్రబుద్ధుల గొప్పతనం అనాలో - కాని జరుగుతున్న విషయం అది.

ఇదే ఆలోచిస్తూ సుబ్బారావ్ బెడ్ దగ్గరే కూర్చున్నాను.

అవతలి బెడ్ మీద కుర్రాడు బాధగా అరుస్తున్నాడు. నడివయసావిడ బెడ్ దగ్గరే నిస్సహాయంగా కూర్చుని కళ్ళ నీళ్లు పమిట చెంగుతో వత్తుకుంటున్నది.

సుబ్బారావ్ అన్నాడు - "పాపం - వాళ్ళ గురించి పట్టించుకునే వాళ్లేలేరు. పెద్ద డాక్టర్ల దగ్గర్నించీ తోటీల దాకా ఎవరూ ఆ బెడ్ చాయలకురారు. వచ్చినా కేస్‌షీటు చూడటం - మరీ మరీ వెంటపడితే కసురుకుని మందులివ్వటం, అంతే! - అతని పరిస్థితి అంతగా బాగున్నట్టు లేదు. ఆవిడ ఒకటే గోల!"

నేను నెమ్మదిగా అన్నాను. - "ఈ హాస్పిటల్లో డబ్బులిచ్చిన వాళ్ళకి -- ప్రయివేటు హాస్పిటల్లో జరిగినదానికన్నా ఎక్కువగా జరుగుతుంది. అందుకే ఇక్కడ ధనవంతులందరూ ఎడ్మిట్ అయి - డాక్టర్ల దగ్గర్నించీ తోటీలదాక డబ్బు యివ్వటం అలవాటు చేస్తున్నారు. వాళ్ళు ఆ అలవాటుని కాదనక - బీదవాళ్ళ దగ్గర రక్తం పిండి డబ్బు తీసుకోటానికి చూస్తారు. కాని వాళ్ళేం యిస్తారు? ఆకలితో కాలే కడుపునీ శూన్యాన్ని నింపుకున్న కళ్ళనీ తప్ప. అందుకే వాళ్ళకి యిక్కడ జరగదు, ఇది పేదలకు ధర్మాసుపత్రి కాదు. ధనవంతుల వేసవి విడిది - ఛీ ఛీ!"

సుబ్బారావ్ ఏం మాట్లాడలేదు. బహుశా సిగ్గుపడ్డాడేమో డబ్బులిచ్చి పనులు చేయించుకుంటున్నాం కనుక.

బ్రదర్ వచ్చాడు - "సాయింత్రంలోగా అన్ని పరీక్షలూ పూర్తిచేయిస్తాను సార్ - మీరేం గాభరాపడకండి!" అన్నాడు.

పిలిచినా మిగతావాళ్ళ దగ్గరకు వెళ్ళని బ్రదర్ - మా దగ్గరకు అలా మాటి మాటికీ ఎందుకు వస్తున్నాడో కొంచెం అర్ధమయింది.

చివరికి అతనే అన్నాడు. "ఒక పది యిప్పుడివ్వండి సార్ - డిశ్చార్జి అయి వెళ్ళేముందు మిగతాది యిద్దురుగాని" -

"అంటే మొత్తం ఎంత అని?" అడిగాను నెమ్మదిగా-

"మీ లాటి వారు కాకపోతే ఎవరిస్తారు సార్ - ఏదో అవసరం కొద్దీ-"

ఎవరి అవసరం? అతనిదా? మాదా?-

ఈ లోపలే సుబ్బారావ్ అతనికి పది రూపాయల నోటు అందించాడు.

"నమస్కారం సార్!" మాళ్ళా వెకిలిగా నవ్వాడు బ్రదర్.

ఇదే ఆలోచిస్తూ కూర్చున్నాను -

ఏదో గోల వినపడేసరికి ఉలిక్కి పడ్డాను.

నడివయసావిడ పెద్దగా తిడుతున్నది.

ఆవిడముందు నుంచొని వున్నాడు బ్రదర్.

"ఊరుకోవమ్మా వూరికే వాగక-" అంటున్నాడు బ్రదర్.

"మర్యాదగా మాట్లాడటం నేర్చుకో- అసలు నువ్వు నువ్వు అంటావేమిటి? నేనూ చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్నాను. మర్యాదగా మాట్లాడటం తెలీనివాడివి..."

"తెలుసులేవమ్మా మర్యాద - నీ కొక్కదానికే తెలిసినట్టు-"

'భూమిపైన జానెడు లేవు - నీకూ డబ్బు కాపీనమే - నీకు పది రూపాయలు యివ్వలేదని పిల్లాడికి ప్లాస్టర్ లేదంటావా. డబ్బులిచ్చిన వాళ్ళకి వెంటనే తెచ్చిస్తావా. నాలాంటి వాళ్ళకు పాలూ, పళ్ళు, బ్రెడ్ సరిగా అందనివ్వక మధ్యలోనే ఎగర కొట్టేస్తావు. పెద్ద డాక్టరు వస్తున్నాడని అపస్మారకంగా వున్న పిల్లాడిని వదిలి బయటకు పొమ్మని తరిమేస్తావు. ఏం మనిషివయ్యా నువ్వు - నీకు పిల్లలు లేరా ప్రాణాలు విలువ తెలీదూ-'

"మాటలు మీరకు. మర్యాదగా వుండదు. నా సంగతి నీకు తెలీదులావుంది - నేనింత వరకూ ఎవరిదగ్గరా 'కానీ' తీసుకున్న పాపాన పోలేదు. కానీ యిక్కడ కొన్ని రూల్సు అంతే, వాటి ప్రకారం పోవాల్సింది-"

"ఓహో - మీకు రూల్సున్నయ్యా - డబ్బులిచ్చినవాళ్ళకి ఆ రూల్సు చెల్లవా అన్నీ నాలాటి వాళ్ళకేనా - స్టాకులో ప్లాస్టర్ దాచుకుని అవసరం కల్పించి అమ్మమని చెబుతున్నయ్యా మీ రూల్స్ - ఏమిటయ్యా మీ రూల్స్? డబ్బు చేతికి రాందే మాట్లాడరు. - మీ కిక ప్రభుత్వం జీతాలెందుకు యిస్తున్నట్లో. మామూళ్ళు యిచ్చేవాళ్ళకు బుద్ధిలేకపోతే తీసుకునే వాళ్ళకయినా వుండక్కర్లా!"

"అనవసరంగా మాట్లాడకు. కడుపు మంటగా వుంటే పోయి సూపర్నెంటుకి రిపోర్టుచేసుకో యిక్కడే మాత్రం వూరికే వాగక."

"ఆఁ! చేస్తాను. రిపోర్టుచేస్తాను. ఎందుకు చేయను? నీ అంతు తేల్చుకుంటాను. ఈ విషయమేమిటో తేల్చుకుంటాను!" అరుస్తున్నది ఆవిడ.

బ్రదర్ ఛీత్కారం చేశాడు!

ఒక పావుగంట తర్వాత బ్రదర్ నెమ్మదిగా అన్నాడు. "సూపరింటెండెంట్‌కి రిపోర్టు చేస్తుందట. రిపోర్టు. ఆయనకు మాత్రం ఆ సంగతి తెలీదా. అటువంటి పనులు ఆయన చెయ్యాడా. అసలు ఆయన సరిగ్గా వుంటే మాకీ పనులు చేయటానికెలా వీలవుతుంది సార్!"

నేనేం మాట్లాడలేదు. కనీసం నవ్వలేదు కూడా. నవ్వితే పూర్వంలాగా అతను తనని సపోర్టుచేస్తున్నాననుకుంటాడు, నిజానికి అతన్ని తిడుతున్నంతసేపు నాకదో విధమైన ఆనందం వేసింది. ఆ తిట్లలో మాలాటి వాళ్ళను తిట్టినా అది నిజమే కనుక నేను బాధపడలేదు. ఒక ఆడమనిషి ధైర్యంగా అలా పచ్చి నిజాల్ని పది మందిలో నగ్నంగా నిలబెట్టి కడిగేస్తుంటే నేను ఎంత అధోగతిలో వున్నానో అర్థం అయింది, 'కానీ తప్పదు ప్రాణ భయం' అనేది ఒక ఎక్స్‌క్యూజ్ కానే కాదు అనిపించింది. అందరూ అలా ఎదురు తిరిగి నిలబడితే దేశంలో అరాచకం, లంచం కల్తీ మొదలైనవి సులభంగా రూపుమాపవచ్చు అనిపించింది. ఎంత మహర్షిలాటి వారి ఓర్పుకయినా ఒక లిమిట్ వుంటుంది. పరిస్థితులు మరీ ఘోరంగా తయారవుతున్న కొద్దీ, ఒక విధమైన 'ఫ్రస్టేషన్' బయల్దేరుతుంది. చివరకు అదీ ముదిరి, ఎంత పిరికివాడినయినా ఎదురు తిరిగేలా తయారు చేస్తుంది. అసలు విప్లవం అనేది అలాగే వస్తుందేమో! ప్రస్తుతం దేశంలో జరిగే అరాచకం, అన్యాయం, కల్తీ, లంచం, దేవుడు వరమిచ్చినా పూజారి యివ్వనట్టు ప్రభుత్వం ప్రజలకు కలుగచేసే సౌకర్యాలను మధ్యలోనే మింగేసే పెద్ద పెద్ద ప్రభుత్వోద్యోగుల డబ్బు దాహం - ఇవన్నీ చూస్తే త్వరలో అటువంటిదేదో

వచ్చే సూచన కనిపిస్తూనే వుంటుంది.

ఆలోచనలను ఆపి, సుబ్బారావ్ వేపు చూశాను.

అతనూ ఏదో ఆలోచిస్తున్నాడు.

డాక్టర్ రాగానే ఆయనా, బ్రదర్ ఒక పావుగంట మాట్లాడుకున్నారు. తర్వాత సుబ్బారావ్‌ని స్ట్రెచర్ మీద యి.సీ.జీ. పరీక్షకు తీసుకు వెడుతుంటే అతనితో పాటే వెళ్లాను. అక్కడనుంచి మిగతా పరీక్షలన్నీ పూర్తిచేసుకుని వార్డుకు వచ్చేసరికి చీకటిపడింది.

అప్పుడే చూశాను. ఆ బెడ్ ఖాళీగా వుంది. విచిత్రం అనిపించింది. అర్థం కాలేదు, బ్రదర్ నడిగాను.

"అతన్ని డిస్చార్జ్ చేశేశాం సార్. అతని అటెండెంటు ఒకటే న్యూసెన్స్ - మిగతా పేషెంట్సు డిస్టర్బ్ అవుతున్నారు. అదీకాక అతని పరిస్థితి బాగానే వుంది. అందుకని డిస్చార్జ చేశాం!"

"అతని పరిస్థితి బాగా వుందా? బాగాలేదనేకదా ఆవిడ అంత గొడవ చేసింది".

అతను నవ్వాడు. కొంచెం ఆగి మళ్ళీ నవ్వి వెళ్ళిపోయాడు.

ఖాళీ అయిన ఆ బెడ్‌ను యాభై రూపాయలకు యింకో ధనవంతుడికి అమ్ముకునే డాక్టరుగారు మదిలో మెదిలారు.

"ఇదేమిటీ అన్యాయం?" అన్నాను సుబ్బారావ్‌తో.

సుబ్బారావ్ ఏం మాట్లాడలేదు, ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఒక పని చేద్దాం గురూ! ఆవిడ యింటికి వెళ్ళి, ఆ కుర్రాడిని వేరే డాక్టరు చేత పరీక్ష చేయిద్దాం. పేషెంటు కండిషన్ బాగులేకపోయినా బలవంతంగా వేరే వుద్దేశ్యంతో డిస్చార్జ్ చేశారని ఈ డాక్టర్ మీద కేసు పెట్టిదాం, తిక్క కుదురుతుంది!" అన్నాను.

సుబ్బారావ్ ఒక్క క్షణం మౌనంగా వున్నాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు. "ఆ కోపంతో డాక్టర్ నన్ను ఆపరేషన్ టేబుల్ మీదే గల్లంతు చేస్తాడు. నువ్వు చూసి సంతోషించు. అయినా రేపు కోర్టులో నువ్వు సాక్ష్యం చెపుతావా -- నే నిచ్చిన లంచంతో నన్ను బాగా చూశాడు. ఆవిడ యివ్వనందుకు అలా జరిగింది అని - అలా అయితే హాస్పిటల్ నుంచి సరాసరి అదే అంబులెన్స్‌లో జైలుకి వెళ్ళవలసివస్తుంది!"

జవాబు చెప్పలేక కిటికీలోనించి బయటకు చూశాను. అంతా చీకటిగా వుంది.

స్వార్థం, ఆశ అన్నవి మానవత్వాన్ని హత్య చేయటానికి వాడే ఆయుధాలు. నీతి, నిజాయితీలను నాశనం చేసే కీటకాలు. ప్రేమ, అనురాగాలను దహించేసేదావాగ్ని జ్వాలలు.

బయట చీకటి బాగా నల్లగా వుంది. మానవత్వానికి మసిపూసినట్టుగా వుంది.

రెండ్రోజుల తర్వాత ఆ కుర్రాడు (డబ్బు లేకపోవటంవల్ల) వైద్య సహాయం లేక చనిపోయాడని చెప్పటం ఈ కథను పూర్తి చేయటానికికావచ్చుకాని, అలాటి సామాన్యుల హృదయ వ్యధను మాత్రం తీర్చలేదు.

అందుకే అంటున్నాను - 'మానవత్వమా ఎక్కడున్నావ్?' అని. ❋